నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం డిసెంబర్ 22, 2024 www.navatelangana.com

నేడు జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి పర్యటన

- పీహెచ్‌సీ, ఎంసిహెచ్ భవనాలను ప్రారంభించనున్న దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహా నేడు(ఆదివారం) జిల్లాలో పర్యటించనున్నారు. రెంజల్ పీహెచ్‌సీ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాత శిశు సంరక్ష కేంద్రం (ఎం సి హెచ్) భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవనాన్ని సందర్శించనున్నారు. తదనంతరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖపై పనితీరుపై రివ్యూ మీటింగ్ జీజీహెచ్‌లో నిర్వహించనున్నారు. కాగా ఈ కార్యక్రమాలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సైతం హాజరుకానున్నారు.

నేరస్తులకు శిక్షపడేట్లు చూడాలి

- ఉమ్మడి జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య సమావేశం



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివరెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య నిజామాబాద్ కామారెడ్డి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్టు జారీ చేసిన అరెస్ట్, ఇన్వెస్టిగేషన్, సాక్షాలు, సేకరించే విధానంపై క్లుప్తంగా వివరించారు. నూతన చట్టాల ప్రకారం వీడియో సేకరణ గురించి తెలియజేశారు. నేరస్తులకు శిక్షపడేటట్లు చూడాలని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనరసయ్య, వసంత, శ్యామ్ రావు, శేషు, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వరరావు, రామకృష్ణ రహీముద్దీన్ రాజేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

- సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల ముగింపులో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

ముఖ్యమంత్రి కప్ 2024 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు బహుమతులు తీసుకరావాలనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సి.ఎం. కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ నెల 7,8 తేదీల్లో గ్రామ పంచాయతీ, 10 నుండి 12 తేదీల్లో మండల, మున్సిపల్ స్థాయిల్లో, 16 నుండి 21 వరకు జిల్లా స్థాయిల్లో క్రీడలు నిర్వహించగా.. 8000 మంది క్రీడాకారులు గ్రామ స్థాయిల్లో 13 ఈవెంట్లలో పాల్గొన్నారని, ఒకవేయి మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొననున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు బహుమతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్ ఈవెంట్లలో విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ అంకిత భావం కలిగి ఉంటే క్రీడల్లో రాణిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో రాణించాలని తెలిపారు. ఓడిన వారు కృంగిపోకుండా మరోమారు క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటాలని అన్నారు. కష్టపడి చదవాలని ఏదో ఒక ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. మత్తు పానీయాలకు, డ్రగ్స్ బారిన పడకూడదని తెలిపారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదువుకొని 245 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సంపాదించారని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుండే గ్రంథాలయాల్లో చదవాలని సూచించారు. సెల్ ఫోన్ ల బారిన పడకూడదని తెలిపారు.

మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ హార్డ్ వర్క్ చేయడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీల్లో అవకాశం వచ్చిందని, మరింత కృషిచేసి రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథ్, అథ్లెటిక్ జనరల్ సెక్రటరీ హరిలాల్, పలు పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పి.ఈ.టీ.లు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

నిజామాబాద్ సిటీ : సీఎం కప్ పోటీలు ముగిసాయి. ఈనెల 16 నుండి 21 వరకు జిల్లా స్థాయి పోటీలు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు శనివారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్లో జిల్లా స్థాయి క్రీడలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం తో పాటు మెడల్స్ ని అందించారు. ఈ కార్యక్రమములో టి జి పి ఈ టి ఏ అధ్యక్ష, కార్యదర్శులు, క్రీడ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, పిడి, పిఈటి లు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



గెలుపొందిన జట్టుకు షీల్డ్ అందజేత

ఏదో కారణాలతో తొలగించాలని చూస్తే ఊరుకోబోం

- 23 ఏండ్ల అనుభవం ఉన్నా.. మళ్లీ రాత పరీక్ష రాయాలనడం సిగ్గుచేటు
- సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల ఆందోళన
- రాత పరీక్షలు రద్దు చేయకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టీకరణ
- నిజామాబాద్‌లో పోలీసు నిర్బంధాల నడుమ రాస్తారోకో

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

కాంట్రాక్టు ఏఎన్‌ఎం ఎంపిహెచ్ ఎస్ఎఫ్‌కు రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఏదో కారణాలతో తమను తొలగించాలని చూస్తే ఊరుకోబోం అని స్పష్టం చేశారు. విధుల్లో తమకు 23 ఏండ్ల అనుభవం ఉన్నా. మళ్లీ రాత పరీక్ష రాయాలనడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. రాత పరీక్ష రద్దు చేసి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు 48 గంటల నిరసన దీక్ష శనివారంతో ముగిసింది. నిజామాబాద్‌లో పోలీసుల నిర్బంధాల నడుమ రాస్తారోకో చేపట్టారు. కామారెడ్డిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు.

కంఠేశ్వర్ : కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష రద్దు చేయకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. యూనియన్ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎం లందరినీ రెగ్యులర్ చేయాలని రాస్తారోకో నిరసన కార్యక్రమానికి పోలీసు యంత్రాంగం నిర్బంధాలు ఆటంకాలు పెట్టినా ధర్నా చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో 2000వ సంవత్సరం నుంచి నేటి వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఎ.ఎన్.ఎం.లు రెగ్యులరైజెషన్, కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని దశాబ్దాల తరబడి దశలవారి ఆందోళన, పోరాటాలు, నిరవధిక సమ్మెలు చేస్తున్నట్టు తెలిపారు. సమ్మెల సందర్భంగా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, గతంలో సమ్మె సందర్భంగా ఎఎన్ఎమ్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తేది 02.09.2023 రోజున మెమో నెం. 7716/జి/2023-1 ద్వారా ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. ఈ కమిటి ఎ.ఎన్. ఎం.లతో సమావేశం జరిపి వారి సమస్యల పరిష్కారం కోసం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని మెమోలో పెర్కొన్నారు. కానీ ఈ కమిటీ ఇప్పటి వరకు సమావేశం కాలేదని, పైగా ఈ కమిటీ రిపోర్టు లేకుండానే 2024 డిసెంబర్ 29వ తేదిన రాత పరీక్ష ఉంటుందని ప్రకటించడం వలన ఏఎన్ఎంలు తీవ్ర ఆందోళనలో ఉన్నట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ త్రిసభ్య కమిటీని ఎఎన్ఎమ్‌లతో సమావేశ పరిచి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఎఎన్ఎమ్లకు రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని, సర్వీస్ వెయిటేజీ 50 మార్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జిల్లా నాయకురాలు ప్రమీల, గంగా, జమున, సావిత్రి, విజయలక్ష్మి, సావిత్రి, సరోజ, సుమలత, పద్మ, సంతోషి, సరోజ, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైటాయించి నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు, సీఐటీయూ నాయకులు



కామారెడ్డిలో రాస్తారోకో

కామారెడ్డి : 23 సంవత్సరాల అనుభవమున్న కాంటాక్ట్ ఏఎన్ఎం లను ప్రస్తుతం పరీక్ష రాసిన తర్వాతనే రెగ్యులర్ చేస్తామని చెప్పడం సిగ్గుచేటని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎలాంటి రాత పరీక్ష నిర్వహించకుండా తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలోని కాంటాక్ట్ ఏఎన్ఎంలు మున్సిపల్ కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము ఈ ఉద్యోగంలో చేరే సమయంలోనే పరీక్షలు రాసే ఉద్యోగంలో చేరినట్టు గుర్తుచేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తాము ఎన్నోసార్లు తమను రెగ్యులర్ చేయాలని కోరిన ఆ ప్రభుత్వం చేయలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తాము రెగ్యులర్ అవుతామని ఎన్నో కలలకు కన్నామని ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ మాదిరిగానే వ్యవరిస్తుంద న్నారు. ఏ పనిలోనైనా అనుభవం ముఖ్యమన్నారు. తమకు ప్రాక్టికల్ నాలెడ్జి ఉందని దాని ఆధారంగానే తమను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఏదో కారణం చెప్పి తమను ఈ ప్రభుత్వం తొలగించాలని చూస్తుందని, తమను రెగ్యులరైజ్ చేసే వరకు తాము ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు కొత్త నరసింహులు, ఆశా వర్కర్లు దీవెన, కవిత, అర్పియా, సంధ్యారాణి, స్వరూప, రేణుక, జోష్న దేవి, మౌనిక, విజయ, గంగమని, ఫ్లారెన్స్, బాలబాయి, శైలజ పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించండి

- వందశాతం ఉత్తీర్ణత సాధించాలి
- జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో డీఐఈఓ రవికుమార్ సమావేశం



జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులలో చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తురుమలపూడి రవికుమార్ అన్నారు. శనివారం జిల్లా ఇంటర్ విద్యా కార్యాలయంలో నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు 90 రోజుల ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కళాశాలలో ఇదివరకే సిలబస్ పూర్తి చేసినందున మరోసారి రివిజన్‌తో పాటు ప్రయోగశాలలో ప్రయోగాలను అన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రయోగశాలలో అవసరమైన ముడి పదార్థాలను సమకూర్చుకోవడానికి ఇంటర్ బోర్డు డబ్బులు సమకూరుస్తుందని అన్నారు. యూనిట్ టెస్టులలో వచ్చిన మార్కులను ఆధారంగా చేసుకుని అర్ధ సంవత్సరం పరీక్షలలో వచ్చిన మార్కులను దృష్టిలో పెట్టుకొని వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణతో పాటు ఎంసెట్, ఎప్సెట్ తరగతులు కూడా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ కళాశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని దానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌లను ఆదేశించారు. పిల్లలకు అర్థం కానీ సబ్జెక్టులో పదే పదే బోధించి, పరీక్షలు నిర్వహించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి విద్యార్థి హాజరు పట్టికను నిర్వహించడంతో పాటు మార్కులను ప్రతి సబ్జెక్టులలో పరిశీలించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆదర్శ పాఠశాలల్లో 2025-26వ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానానికి నోటిఫికేషన్ శనివారం జారీ అయింది. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశాలకు http://telanganams.cgg.gov.in వెబ్ సైటు ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జనవరి 6వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 13వ తేదీనా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఆయా ఆదర్శ పాఠశాలల్లో 7,8,9,10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. వాటికోసం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఆదర్శ పాఠశాలల ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య, భోజనం అందజేస్తుందని, కావున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిజాంసాగర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ సంధ్య ఒక ప్రకటనలో సూచించారు. మండలం చుట్టుపక్కల ఉన్న విద్యార్థులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి

- ప్రజా సంఘాల డిమాండ్.. అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బేషరతుగా వెనక్కు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలో బిజెపి నాయకుడు అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేశ్ డిమాండ్ చేశారు. శనివారం ధర్నా చౌక్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలు తీవ్రంగా కలిసి వేశాయని అందుకు అమిత్ షాను మంత్రి పదవి నుండి తక్షణం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్లో అమిత్ షా మాట్లాడుతూ అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని తలిచే కంటే దేవుళ్ళని తలిస్తే స్వర్గానికి పోతారంటూ వాక్యానించడం అంబేద్కర్ ను అభిమానించే కోట్లాది మంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజల మనోభావాలను అవమానపరిచడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని బిజెపి,ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతంలో భాగమేనని అన్నారు. గతంలో కూడా అనేకసార్లు కేంద్ర మంత్రులు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సైతం రిజర్వేషన్లను సమీక్షించాలని, భారత రాజ్యాంగాన్ని మార్చడానికి అధికారంలోకి వచ్చామని, అంబేద్కర్ ఒక్కరే రాజ్యాంగాన్ని రాయలేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించకపోగా ప్రధాని నరేంద్ర మోడీ సమర్థించే విధంగా మాట్లాడడం బాధాకరమని అన్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేసేదాకా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సావిత్రి, పద్మ, విజయ, కళమ్మ సరిత, విజయ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, చక్రి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేసి నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఇంటర్‌లో ఉత్తీర్ణతా శాతం పెరగాలి

- ఇంటర్ నోడల్ జిల్లా అధికారి షేక్ సలాం

నవతెలంగాణ-గాంధారి

ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా చూడాలని ఇంటర్ నోడల్ జిల్లా అధికారి షేక్ సలాం సూచించారు. శనివారం గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల లెక్చరర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులతో అనుసంధానమై భోధనచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా విద్యార్థుల శ్రేయస్సు, బోధన నాణ్యత, మరియు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం ప్రణాళికలను రూపొందించడంపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడడంతో ప్రత్యేక తరగతులు నిర్వహణ, ఉత్తీర్ణత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బోధన, విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రస్తుత విద్యా సంవత్సరంలో సిలబస్ పూర్తి చేయడం ఎలా జరిగిందో నోడల్ అధికారి సమీక్షించారు.

విద్యార్థుల పాఠశాల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి కౌన్సెలింగ్ సెషన్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగారం అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఏడాది ఫలితాలను మెరుగుపరచడం కోసం కార్యాచరణ ప్రణాళికతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. అనంతరం అధ్యాపకుల టీచింగ్ డైరీ, అకాడమిక్ ఆర్గనైజర్, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగారాం తో పాటు అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు



కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి

ఫోక్సో చట్టం కింద ఒకరిపై కేసు నమోదు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన దాసరి రాములు పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు శనివారం తెలిపారు. తాండూర్ గ్రామానికి చెందిన దాసర రాములు నాగిరెడ్డిపేట్ మండలానికి చెందిన ఓ మైనర్ బాలికను మాయ మాటలు చెప్పి గత 15 రోజుల నుండి తనతో పాటు హైదరాబాద్ తీసుకెళ్లి గత రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో బాలికను తిరిగి వదిలిపెట్టి పారిపోతుండగా నాగిరెడ్డిపేట్ మండల పోలీసులు పట్టుకొని విచారణ చేపట్టారు. గత 15 రోజుల క్రితం ఐదో తేదీన నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్లో బాలికపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గత రెండు రోజుల క్రితం కేసును ఛేదించిన పోలీసులు విచారణ నిర్వహించి దాసరి రాములు పై కిడ్నాప్, ఫోకోస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు తెలిపారు. దాసరి రాములను ఎల్లారెడ్డి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు.

హాస్టల్‌లో నాణ్యతలేని భోజనంపై విచారణ

నవతెలంగాణ కథనానికి స్పందించిన జిల్లా యంత్రాంగం



విచారణ చేపడుతున్న అధికారులు

నవతెలంగాణ స్పందన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో రెండు రోజుల క్రితం ఉడికి ఉడకని అన్నం తిని అవస్థకు గురైన విద్యార్థులు ఈ సమస్యపై వచ్చిన వార్త కథనానానికి జిల్లా యంత్రాంగం కదిలింది. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను వివరణ కోరగా కొత్త రకం బియ్యం రావడం వలన వంటను అండే విధానంలో లోటు పాట్లు జరగడంతో ఈ సమస్య ఏర్పడిందని, బియ్యం నాసిరకంవి కావని విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఎవ్వరికీ కూడా కాలేదని ఒకరిద్దరి మాత్రమే ఈ సమస్య వచ్చిందని ఈ సమస్యపై జిల్లా పాలన అధికారి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని తనికీలో భాగంగానే జిల్లా ఆహార భద్రత అధికారిణి సునీత విచారణ చేపట్టి జిల్లా అధికారికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఇకనుంచి ఈ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజు, వెంకటేష్, తహశీల్దార్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

- సీఎంను కలిసి విన్నవించిన ఎమ్మెల్యే ధన్‌పాల్



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రావలిసిన పెండింగ్ నిధులు టియుఎఫ్ఐడిసి ఫండ్ 60 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధి ఫండ్ 5 కోట్లు, స్పెషల్ ఫండ్ వంద కోట్లు వెంటనే విడుదల చేయాలని అలాగే నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుకై ముఖ్యమంత్రి ఛాంబర్‌లో రేవంత్ రెడ్డి కి సీనియర్ శాసనసభ్యులు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డితో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇందూర్ నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని పోవడానికి సిద్ధంగా ఉన్నానని, వివక్ష చూపకుండా అర్బన్ నియోజకవర్గానికి నిధులు వెంటనే విడుదల చేయాలని అర్బన్ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రికి విన్నవించిన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన నిధులు త్వరలో మంజూరు చేస్తామని సుదర్శన్‌రెడ్డి సమక్షంలో హామీనిచ్చినట్టు తెలిపారు.

నూతన బూత్ కమిటీల ఏర్పాటు

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూర్ మండలంలోని గుత్ప, రాంచంద్రపల్లి గ్రామంలో శక్తి కేంద్ర ఇన్చార్జ్ సూర శ్రీకాంత్ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షులు కొత్తూరు గిరీష్ ఆధ్వర్యంలో బూత్ నూతన కమిటీలు శనివారం వేశారు. నూతన బూత్ అధ్యక్షులుగా పందెన అఖిలేష్, కందుల భూషన్, పిట్ల అజయ్, ఇందూర్ మహేష్, రవి, మెంగాని సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 12 మందితో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకులు తోడు మహేష్, ఆలూర్ మండల ప్రధాన కార్యదర్శి సూర శ్రీకాంత్, రెండు గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అద్భుత ప్రతిభ కనబరిచిన కుక్నూర్ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్



మండలంలోని కుక్నూరు ప్రైమరీ పాఠశాలను హైదరాబాద్‌లోని హెచ్ఎల్‌టీఈ సర్వీస్ కంపెనీ దత్తత తీసుకున్నట్లు ఉపాధ్యాయులు నరేందర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన వార్షికోత్సవ సెలబ్రేషన్ డే సందర్భంగా ప్రైమరీ, హైస్కూల్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమం చూపరులను ఎంతగానో ఆకట్టుకుందని, మెమెంటో, బహుమతులతో సత్కారం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం సోషల్ మీడియా ఇంచార్జ్‌గా పబ్బ శేఖర్



నియమకపత్రాన్ని అందుకుంటున్న పబ్బ శేఖర్

నవతెలంగాణ-పోతంగల్

మున్నూరు కాపు సంఘం సోషల్ మీడియా రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జిగా, పోతంగల్ మండల కేంద్రానికి చెందిన పబ్బ శేఖర్‌ను నియమిస్తూ మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్రం సంజీవ్ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పబ్బ శేఖర్ మాట్లాడుతూ.. తనకు సహకరించినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మున్నూరుకాపు యువత సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్ కుమార్, కన్వీనర్ చింతపండు మహేందర్, యువత రాష్ట్ర కార్యదర్శి డొంగ్లి శ్రీనివాస్, ఉమేష్, అంకుష్, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించనున్న నేపథ్యంలో శనివారం మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్ మండల స్థాయి అధికారులతో నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ నూతన భవనం రూ.కోటి 56 లక్షల వ్యయంతో పూర్తి చేయగా.. ఆ భవనాన్ని వారు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ రఫీ హైమద్, తదితరులున్నారు.

దేవాదాయ భూముల గుర్తింపు



భూములను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మానిక్‌బండార్ గ్రామ శివారులో గల వెంచర్‌లో దేవాదాయ భూములను గుర్తించేందుకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో శనివారం సర్వే నిర్వహించారు. మానిక్‌బండార్ గ్రామ శివారులో సుమారు 218 ఎకరాల భూమిలో నూతన వెంచర్ వేశారు. అందులో ఇరిగేషన్ కాల్వలు, దేవాదాయ భూములు, బచ్చల కుంట కట్ట పూర్తిగా కబ్జా చేసి వెంచర్ వేశారని గ్రామస్తులు ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేయడంతో మండల సర్వేయర్, ఆర్ఐ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు. ప్రస్తుతం లాండ్ మార్క్ మాత్రమే వేశారు. పూర్తి సర్వేను మూడు రోజుల్లో వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని సర్వేయర్ కిషన్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ షఫీ, దేవాదాయ శాఖ అధికారులు కిషోర్, సుమన్, లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్ రాయ్‌సింగ్, మాజీ ఎంపీటీసీ నర్సగౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్ద వాగులోని మట్టి అమ్మకం

నవతెలంగాణ-మాక్లూర్



పెద్దవాగులో మట్టిని తోడుతున్న దృశ్యం

మండలంలోని బోర్గం (కె) గ్రామ శివారులో గల పెద్ద వాగులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను గ్రామ కమిటీ సభ్యులు పట్టుకొని సంబంధిత అధికారులకు శనివారం అప్పజెప్పారు. పెద్ద వాగుపై బ్రిడ్జి పనులు కొనసాగుతు న్నాయి. అందులో భాగంగానే బ్రిడ్జి కింద ఉన్న మట్టిని తీసి వేరే చోట పోయాల్సి ఉండగా ఆ మట్టిని కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తి రూ.500 ట్రాక్టర్ చొప్పున అమ్ముకుంటున్నారు. ఈ విషయం గ్రామస్తులకు తెలువడంతో ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఇలాంటి అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సునీల్ కుమార్‌రెడ్డి కృషితో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఉదయం కొత్తపల్లి గ్రామంలో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు మండలాధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు మంజూరు కావడంతో లబ్దిదారులు అవినాష్ సంతాకుల రూ.54,000 వేలు, నికోన్ రూ.94,000 వేలు, జోషి భూపతి రూ.42,000 విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. అనంతరం లబ్దిదారులు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందా రవి, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, గోపిడి రాజారెడ్డి, సురేష్ గౌడ్, చిన్నారెడ్డి, నర్సారెడ్డి, శంకర్, రాజేశ్వర్ గౌడ్, రాకేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేసినట్టు ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుక రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఉత్కమ్ శ్రీనివాస్‌గౌడ్, గ్రామ అధ్యక్షులు తాజోద్దీన్, జనరల్ సెక్రటరీ కూడలా వినోద్, ప్రధాన కార్యదర్శి కనక రాకేష్, సీనియర్ నాయకులు నల్ల గంగారెడ్డి, శ్రీనివాస్, కాటిపల్లి సాయిరెడ్డి, జై.గంగారాం, రాకేష్, కొప్పు సుదర్శన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయాలి

- సీపీఐ(ఎం) పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సంఘటిత పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. శనివారం సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సభ్యుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. కార్మికవర్గ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని వివరించారు. కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే పద్ధతుల్లో ఆలోచిస్తున్నాయని, ఫలితంగా ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కష్టజీవులను ఐక్య పోరాటాల ద్వారా నిర్వహించాలని, అందుకు సభ్యులు సహకరించాలని ఆయన అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే పద్ధతుల్లో జమిలి ఎన్నికల ద్వారా నియంతృత్వంగా పరిపాలనను కొనసాగించడానికి ఆలోచిస్తున్నాయని, అందుకు ప్రజల్లో విద్వేశాలను రెచ్చగొట్టడానికి అంబేద్కర్‌ను కించపరిచే పద్ధతుల్లో రాజ్యాంగాన్ని అవమానిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడారని తెలిపారు. ప్రభుత్వ వ్యక్తులను పసిగట్టి ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాలని, అదేవిధంగా మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి పోరాటాల్లోకి సమీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు, సీపీఐ(ఎం) నాయకులు సిర్ప లింగం, అనసూయమ్మ, కటారి రాములు, నల్లాల నరసయ్య, ఉద్ధవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

15వ రోజు కొనసాగిన సమ్మె

నవతెలంగాణ-కంఠేశ్వర్



యజ్ఞం చేస్తూ సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 15వ రోజు సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా వైదిక యజ్ఞం కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తమ సమస్యలను పరిష్కరించే సంకల్ప బలం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు రాజు, భూపెందర్ మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. ఇకనైనా తమ న్యాయపరమైన డిమాండ్ అయిన రెగ్యులరైజేషన్ సత్వరమే చేయాలని కోరారు. 20 సంవత్సరాలుగా విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తూ విద్యాశాఖను సర్వతోముఖాభివృద్ధికి తీసుకెళ్తూ కష్టపడుతున్న కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఈ దీక్షలకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, ప్రసాద్ పటేల్, కేజీబీవీ పాఠశాలల పిల్లల తల్లిదండ్రులు గంగాప్రసాద్, కిషన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, మహిళా కార్యదర్శి స్వప్న, నాయకులు ప్రకాష్, అప్సర్, రవి కిరణ్, జాన్, సత్యపాల్, గంగాధర్, ప్రభు, రమేష్, రాణి, సుప్రజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాల్సిందే..

రాష్ట్రంలో సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వాల్సిందేనని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి వారికి మద్దతుగా మాట్లాడారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు పోషకలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్లూర్ సురేష్‌నగర్ కాలనీలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్వాడి కేంద్రం రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసిన సరుకులను, పాలు, కోడిగుడ్లను పరిశీలించారు. కేంద్రానికి విచ్చేసిన చిన్నారుల కోసం వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఆటపాటలతో కూడిన విద్య ద్వారా చిన్నారులు అంగన్వాడి కేంద్రాలకు రావడానికి అలవాటు పడతారన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాధితులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడి కేంద్రంలోని పరిసరాలను చెత్తా చెదారం తొలగించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి నరేందర్, అంగన్వాడీ టీచర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల పిల్లలను గుర్తించి శిక్షణ ఇవ్వాలి

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



ప్రతిభ గల పిల్లలను గుర్తించి శిక్షణ ఇవ్వాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ ప్రభుత్వంలో గత ప్రభుత్వం కంటే విద్యపైన రెట్టింపు బడ్జెట్‌ను కేటాయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో పదివేల కోట్లు ఖర్చుపెడితే ఈ ప్రభుత్వంలో 20వేల కోట్లు ఖర్చుపెడుతున్నట్టు వివరించారు. పిల్లలకు సంతులిత ఆహారం వలన న్యూట్రిషన్ ప్రోటీన్స్ అందడం వలన పిల్లలు మానసికంగా శారీరకంగా ఎదిగే అవకాశం ఉందని తెలిపారు. 'కొన్ని పాఠశాలలో బాలోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది విద్యార్థుల ప్రతిభాపాటవాళ్లు అద్భుతంగా ఉంది. డ్రాయింగ్‌లో, పెయింటింగ్‌లో, క్రీడలలో, పాట పాడటంలో విద్యార్థులను గుర్తించి కొంచెం శిక్షణ ఇస్తే వీళ్లు అంతర్జాతీయ స్థాయిలో చైనా, అమెరికా దేశాలతో కూడా పోటీ పడే అవకాశం ఉంది. ఉదాహరణకు తమ జిల్లా నుంచి మలావత్ పూర్ణ ఉంది' అని వివరించారు.

బోర్గాం స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం.పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌లో వివిధ రకాల ఆహార పదార్థాలను పేరెంట్స్ ప్రదర్శించారు. అలాగే ఈ ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల అందులో ఉండే పోషక విలువల గురించి కూడా విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. దాంతోపాటు పదో తరగతి పరీక్షలు దగ్గరలో ఉన్నందున పేరెంట్స్ టీచర్ మీటింగ్‌ను ప్రధానోపాధ్యాయుడు శంకర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు రాసే విధానంపై పలు విషయాలను కూడా విద్యార్థులకు తెలియజేశారు. పరీక్షలు రాసే సమయంలో ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ఏకాగ్రతతో చదవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంధ్యారాణి, అనుపమ, గంగాధర్, శ్రీకాంత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలను వెనక్కి తీసుకోవాలి

- తక్షణమే క్షమాపణ చెప్పాలి
- సిపిఐ డిమాండ్

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యాలను వెనక్కి తీసుకుని అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని సిపిఐ డిమాండ్ చేసింది. పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. తక్షణమే అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సిపిఐ కార్యాలయంలో అయన మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే మతోన్మాద బీజేపీ శక్తులు అధికారంలోకి వచ్చాక దేశంలో దళితులపై దాడులు ఒకపక్క పెరిగిపోతుంటే కట్టడి చేయాల్సిన అమిత్‌షా తన బాధ్యత మరిచి ఇలాంటి చౌకబారు మాట్లాడటం సరికాదన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరెపల్లి సాయిలు మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలు తెలియని అమిత్‌షా లాంటి అసమర్థులను ప్రజలు పార్లమెంట్‌కు పంపడం దురదృష్టకరమని తెలిపారు. ప్రపంచ దేశాల మన్ననలు పొంది సబ్బండ వర్గాల ప్రజలకూ అణగారిన వర్గాల కొరకు రాజ్యాంగం రచించిన అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్ షాకు కేంద్ర మంత్రి హోదాలో కొనసాగే హక్కు లేదని మండిపడ్డారు. అమిత్‌షా వ్యాఖ్యలపై మోడీ స్పందించాలని, రాజ్యాంగంపై ప్రమాణాలు చేసి పార్లమెంట్‌కు వెళ్లిన అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సోమా శ్రీను, మహిళా సంఖ్య డివిజన్ నాయకురాలు మంగ, దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ కార్యదర్శి మాదరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

- బాల్కొండ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని రేష్మ



మట్టి పరీక్ష కార్డులు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బాల్కొండ

సరైన పంట దిగుబడులు సాధించడం కోసం రైతులు తప్పనిసరిగా నేల ఆరోగ్యం పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని బాల్కొండ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని రేష్మ తెలిపారు. శనివారం జలాల్‌పూర్‌లో రైతులకు భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. సరైన నేలలో, నాణ్యమైన విత్తనం వేయడంతో పాటుగా సరైన మోతాదులో పోషకాలను మొక్కలకు అందించినప్పుడే మంచి దిగుబడి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాయిల్ హెల్త్ మేనేజ్మెంట్ పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వందశాతం ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగా రైతులు తమ పంట పొలాల నుంచి 100 గ్రాముల మట్టి నమూనాలను వ్యవసాయ శాఖకు సమర్పిస్తే ఆ నేలలో ఉండే నత్రజని, భాస్వరం, పొటాష్ లభ్యతతోపాటుగా ఉదజని సూచిక తదితర వివరాలతో కూడిన మట్టి పరీక్ష కార్డులు రైతులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు మోహన్‌రెడ్డి, దేవేందర్, గంగాధర్, గుండేటి కిషన్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రలను శుభ్రంగా కడగాలి

- ఎంపీడీవో చింతరాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసే ముందు వంట పాత్రలను శుభ్రంగా కడగాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. శుభ్రమైన వాతావరణంలో కలుషితం కాకుండా మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేయాలని నిర్వహకులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి ఎంపీడీవో మధ్యాహ్న భోజనాన్ని చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం పూర్తయిన తర్వాత వంట పాత్రలను శుభ్రంగా కడిగి ఉంచాలని, వంట చేసే ముందు మరోసారి వాటిని శుభ్రంగా కడగాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బోజనాన్ని వడ్డిస్తున్న ఎంపిడీవో

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, మండల పాలనాధికారి హెచ్.శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడానికి గాను 40 శాతం మెస్ చార్జీలు పెంచడంతో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఎలా అందిస్తున్నారని వారు ఆరా తీశారు. విద్యార్థులకు పప్పు, కూరగాయలతో పాటు, గుడ్డును అందించాలని వారు ప్రిన్సిపాల్ హర్సియా నాజామ్‌కు సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని వారన్నారు. చిన్నారులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వారు సిబ్బందిని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మండల ప్రజలు తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలో శాంతిభద్రతలను కాపాడటానికి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమండ్లు, కిరణ్ సేట్, కుమ్మరి లక్ష్మణ్, పబ్బ విఠల్, నేరోళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
ఆదివారం | డిసెంబర్ 22, 2024 | www.navatelangana.com

క్రిస్టమస్ ఉత్సవాలకు ముస్తాబవుతున్న చర్చ్‌లు



నవతెలంగాణ-తాడ్వాయి

ఈనెల 25న జరిగే క్రిస్టమస్ ఉత్సవాలకు చర్చ్‌లు ముస్తాబు అవుతున్నాయి. రంగులు వేసి విద్యుత్ లైట్‌లు అమర్చి ముస్తాబు చేస్తున్నారు. క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు సైతం చేస్తున్నారు. కాగా మండల కేంద్రంలో నిర్వహించనున్న వేడుకలకు కామారెడ్డి సి ఎస్ఐ ఫాస్టరేట్ హాజరుకానున్నట్లు స్థానిక పాస్టర్ టి రవీందర్ తెలిపారు.

ఎల్‌డీ నుంచి డీఎఫ్‌ఆర్‌కు ప్రమోషన్



నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పద్మాజీవాడి గ్రామానికి చెందిన వడ్ల వెంకటేష్ ఆర్మీలో ఎల్‌డీ నుంచి డి.ఎఫ్‌ఆర్‌కు ప్రమోషన్ పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. వెంకటేష్‌కు ప్రమోషన్ రావడంతో గ్రామస్తులు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెంకటేష్ను ఆదర్శంగా తీసుకొని యువకులు ముందుకు పోవాలని సూచించారు. లక్ష్యం ఎంచుకొని దాన్ని సాధించేందుకు యువత కృషి చేయాలని, యువత ప్రయత్నిస్తే సాధ్యం కానిదంటూ ఏదీ లేదని అన్నారు.

స్కూళ్లో యోగా డే



యోగా చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి(బిబిపేట్)

కామారెడ్డి జిల్లా బిబిపేట మండల కేంద్రంలోని తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి ఉన్నత పాఠశాలలో యోగ డే సందర్భంగా విద్యార్థులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా మేధ శక్తి తిరిగి వ్యక్తి ఉత్సాహంగా ఉంటాడని, అనారోగ్యం బారిన పడకుండా ఉంటాడన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వ మోహన్, ఆనందరావు, కొండల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సూర్య, రాధిక, సవిత, అరుంధతి, 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన డీఆర్‌డీవో



ఆలయాన్ని సందర్శించిన డీఆర్‌డివో, పలువురు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రి లింగ రామేశ్వర ఆలయాన్ని కామారెడ్డి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ కమిటీ అధ్యక్షులు కొమ్మ దత్తు జిల్లా ఐకెపి డిపిఎం సుధాకర్ ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్, వెంకన్న, ఆలయ పూజారి మల్లికార్జున అప్ప తదితరులు ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం దొరుకుతుందని యోగా గురువు బండి రాములు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన యోగా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిత్యం సమయం కేటాయించి యోగా చేయాలని దీనితో ఏకాగ్రత పెంపొందుతుందని అన్నారు. అనారోగ్యాలకు గురికాకుండా ఆస్పత్రికి వెళ్లకుండా ఉండేందుకు యోగ అంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్ సుధాకర్ అనిల్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ



మాజీ జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చైర్మన్ రాజు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి సభ్యులు తానాజీరావు తల్లి గత నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాజు శనివారం కుటుంబాన్ని పరామర్శించి రత్నబాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం అధికారులు సిబ్బంది తానాజీరావును పరామర్శించారు.

23న పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-కామారెడ్డి

డిగ్రీ చదివిన నిరుద్యోగులకు 23న పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ కేసురెడ్డి గురువేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ స్కిల్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో హెచ్ఇటిఆర్‌డి డ్రగ్స్ ఫార్మా కంపెనీ వారు సుమారు 300 ఉద్యోగుల కొరకు ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉద్యోగ మేళకు హాజరగు అభ్యర్థులు డిగ్రీ స్థాయిలో ఏ గ్రూపులో అయిన విద్యను అభ్యసించి డిగ్రీ ఉండాలనాని సూచించారు. సోమవారం కళశాలలో జరిగె ఈ మేగ రిక్రూట్మెంట్ డ్రైవ్‌ను కమారెడ్డి పట్టణ ప్రాంత విద్యార్థులు అందురు వినియెగించుకోవలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళశాల ప్రిన్సిపాల్ కె.విజయకుమార్, డైరెక్టర్ గోపాల్రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో గల జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమనీ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రక్తదానం ఏర్పాటు చేసినందుకు జిల్లా వ్యవసాయ అధికారి రాయుడు తిరుమల ప్రసాద్‌ను అభినందించారు. చిట్యాల వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తూ 26 సార్లు రక్తదా నం చేసి ఆదర్శంగా నిలుస్తున్న రెడ్డిగారి అశోక్ రెడ్డిని సన్మా నించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న,సమన్వయకర్త డాక్టర్ బాలు లు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అత్య ధిక యూనిట్ల రక్తాన్ని అందజేసిన ఘనత కామారెడ్డి జిల్లా కు ఉన్నదనీ దీనిని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తిం చినట్టు తెలిపారు. జిల్లాలో స్వచ్ఛందంగా చాలామంది రక్తదాతలు రక్తదానానికి ముందుకు రావడం తెలంగాణ రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లాను ఆదర్శంగా ఉంచారని కలెక్టర్ పేర్కొన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన రక్తదాతలను అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో 26 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి,రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ నరసింహము, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ప్రమోద్, అమర్, అరుణ్, పోశెట్టి, జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే పదోన్నతులు



ఉపాధ్యాయులను సన్మానించిన మండల విద్యాధికారి

నవతెలంగాణ-పిట్లం

ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే పదోన్నతులు తామంతట అవే వస్తాయని మండల విద్యాధికారి దేవి సింగ్ అన్నారు. శనివారం మండలంలోని గౌరారం తండా ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరారం తాండ డి ఎస్ టి ప్రాథమిక పాఠశాల లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ సింగ్ , ఉపాధ్యాయులు మహమ్మద్ గౌస్ లు అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తినే పరమావధిగా నిర్వహించడంతో పదోన్నతులు లభించాలని కొనియాడారు. బదిలీ పై వెళ్తున్న ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ తరపున అభినందనలు తెలియ చేస్తూ వీడ్కోలు పలికారు. అనంతరం కాంప్లెక్స్ ఉపాధ్యాయులు , తోటి మిత్ర బృందం శాలువా , పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ రాంపూర్ (కలన్) కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత , రమేష్ , బాల్రాజ్ , ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిజాంసాగర్ మండలం అధ్యక్షులు దేవి సింగ్ , ఉపాధ్యాయులు సుంక్య , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వరినారుకు సోకే తెగుళ్లను నివారించాలి



ఖండేబల్లూరులో నారు మడులను పరిశీలిస్తున్న ఏవో మహేశ్వరి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో వరి తెగుళ్ళ సోకకుండా పలు జాగ్రత్తలు వహించాలని జుక్కల్ మండల వ్యవసాయ అధికారిని మహేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని ఖండేబల్లూరు, కేమ్రాజ్ కల్లాలి గ్రామాలలో రైతులు వేసిన వరినాడు మడులను పరిశీలించారు. వరి నారులో వచ్చే తెగుళ్లను పరిశీలించి పలు రసాయన ఎరువులను పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వరి నారుమడులను జాగ్రత్తగా కాపాడుకోవాలని, నారు బాగుంటే పంట దిగుబడి బాగుంటదని రైతులకు తెలిపారు. అదే విధంగా ఖండేభల్లూరు గ్రామంలోని క్లస్టర్ ఏఈఓ విజయతో కలిసి ఎరువుల మందుల దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు దుకాణ యజమానులకు సూచించారు. రైతులు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని, రైతులు బిల్లులు అడిగితే యజమానులు ఇవ్వకపోతే నేరుగా వ్యవసాయ అధికారులకు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకున్న మందులను అమ్మకాలు జరిపితే కఠినమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేసి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో తో పాటు ఏఈఓ విజయ, రైతులు సిద్ధు గౌండా, సతీష్ ,విటల్, తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

నవతెలంగాణ-తాడ్వాయి/జుక్కల్

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. శనివారం సం గోజువాడి గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలిం చారు. ఇల్లు లేని పేదలను గుర్తించి పూర్తి వివరాలను సేకరించి యాప్ ద్వారా నమోదు చేయాలని సూచిం చారు. ఎలాంటి తేడాలు లేకుండా సర్వే నమోదు చేయా లని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ సవితారెడ్డి తో పాటు పంచాయతీ కార్యదర్శి సిబ్బంది ఉన్నారు.

జుక్కల్ : మండలంలోని ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వం చేపట్టిన నాటినుండి శనివారం నాటి వరకు గ్రామాలలో నిర్వహించిన లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జుక్కల్ ఎంపీడీవో సర్వే అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జుక్కల్ మండల కేంద్రంలోని పలు వార్డులలో ఎంపీడీవో శ్రీనివాస్ స్థానిక పంచాయతీ అధికారితో కలిసి లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించారు. సర్వే చేస్తున్న అధికారులకు పలు సూచనలు చేశారు. జాగ్రత్తగా లబ్ధిదారులు ఇచ్చిన సమాచారాన్ని రాసుకొని వాటిని నివేదికలను పంపించాలని, లబ్ధిదారులు చెప్పిన వాటిని కంప్యూటర్లు నిక్షిప్తం చేయాలని సర్వే అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు జుక్కల్ జీపి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు యూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండలం మున్నూరుకాపు యూత్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా లాడేగావ్ గ్రామానికి చెందిన పేరిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కేమ్రాజ్ కల్లాలి గ్రామానికి చెందిన పాకలి పవన్ ను, కోశాధికారిగా కొమ్ము సతీష్ , ప్రధాన కార్యదర్శి గా లక్షెట్టి శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ గా అంకెవార్ నవీన్‌ను నియమించినట్టు సభ్యులు తెలిపారు. వారితోపాటు ఇంకో 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

12వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-కామారెడ్డి

పాలకులు మారినా.. తమ సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు వాపోతున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 12వ రోజు కు చేరుకుంది. ఈ నిరవధిక సమ్మె నిరసన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు ఆటపాటలతో నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం వందరోజుల గ్యారెంటీ ఏమైందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు మద్దతు ఇవ్వడానికి వచ్చిన ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు కుశల్, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగం, సమగ్ర శిక్ష జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి,శైలజ, దామోదర్, వీణ,సాయిలు లావణ్య, శ్రీను, మాధవి, గంగ ప్రసాద్, బన్సీలాల్, దినేష్, రాజు, రాధికా,లింగం, కృష్ణ, సంధ్య ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ ఖోఖోలో జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి

- కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్న మద్నూర్ గురుకుల బాలుర విద్యార్థులు



మద్నూర్: బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్/తాడ్వాయి

సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు ఖోఖో విభాగంలో మద్నూర్ మండల కేంద్రంలోని బాలుర గురుకుల, కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి అందుకున్నట్టు ప్రిన్సిపాల్ యన్ గంగాకిషోర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుమన్, పీ ఈ టీ గణేశ్, తెలిపారు. విద్యార్థులు జి.జగదీష్, బి.బుత్విక్, సి హెచ్ కిరణ్, కె.బాలాజీ, టి జవహర్ సింగ్, పి.నిఖిలేష్‌ను అభినందించారు.

కబడ్డీలో తాడ్వాయి జట్టుకు ద్వితీయ స్థానం

తాడ్వాయి : సీఎం కప్ కబడ్డీ పోటీల్లో తాడ్వాయి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్టు నేతాజీ యూత్ అధ్యక్షులు పంబల జగదీశ్వర్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం కప్ క్రీడల్లో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో తాడ్వాయి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. మునుముందు తమ క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేలా శిక్షణ పొందాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండారి సంజీవ్ ముదాం నర్సింలు మేకల రాజు క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



మృతి చెందిన వివాహిత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం నల్లమడు గు పెద్ద తండాకు చెందిన ధనవత్ కావేరి అనే వివాహిత (26) తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు లింగంపేట ఎస్సై సుధాకర్ తెలిపారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. కావేరికి 6 సంవత్సరాల క్రితం దానవత్ శ్రీనివాస్‌తో వివాహం కాగా.. వీరికి ఇద్దరు సంతానం ఆదిత్య, ఉన్నారు. మృతురాలి భర్త 9 నెలల క్రితం ట్రాక్టర్ బోల్తా పడి చనిపోయినాడు. మృతురాలు తన పిల్లలతో పాటు నల్లమడుగు పెద్ద తండాలో ఉంటుందన్నారు. శనివారం ఉదయం మృతురాలు తన ఇంట్లో చీరతో ఉరి వేసుకుని చని చనిపోయింది అన్నారు. మృతురాలి మరణం పై అనుమానం ఉందని తన తండ్రి కిషన్ పోలీసులకు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నామని లింగంపేట ఎస్సై తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

బాల్యవివాహాలు నేరం

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలం లోని ఉత్తునూర్ ప్రభుత్వ పాఠశాల నందు శనివారం సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల అరికట్టడంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాలికలకు 18 ఏండ్లు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే 181 నెంబర్‌కు లేదా 100, 1098 నెంబర్ కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ కోఆర్డినేటర్ గిరిజ, సభ్యురాలు సంధ్యారాణి పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పదవతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శని వారం మండల విద్యాధికారి శ్రీహరి సందర్శించారు. కస్తూర్బా గాంధీ విద్యాల యంలో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు వివిధ ప్రశ్నలు అడిగి సమాధానం తెలుసుకున్నారు. ప్రత్యేకంగా పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే వంటగదిని తనిఖీ చేశారు. వంటగదిని వంట పాత్రలను పరిశుభ్రంగా వాడాలని సూచించారు.

రకరకాల వంటకాల ప్రదర్శన

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో శని వారం తెలంగాణ ఆహారోత్సవంలో భాగంగా వివిధ రకాల వంటకాలను విద్యా ర్థులు ప్రదర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శెట్టిపల్లి పాఠశాలలో నెలవారి తల్లిదండ్రుల సమావేశంలో ఆహారోత్సవం సందర్భంగా విద్యార్థులు రకరకాల వంటకాల్ని తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి కాంప్లెక్స్ పనితీరును కొనియాడుతూ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈయన వెంట ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామ పంచాయతీల పరిధిలోని ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని ఎంపీఓ మలహరి కార్యదర్శులకు సూచించారు. శనివారం లింగంపేట మండలంలోరని పోల్కంపేట్ గ్రామపంచాయతీని సందర్శించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా తిరుగుతూ అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి అశ్వక్ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులకు పోషక పదార్థాల పౌష్టికాహారం అందజేయాలి

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థులకు పోషక పదార్థాల పౌష్టికాహారాన్ని అందజేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లక్ష్మీ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మానగర్ గ్రామ ఎంపియుపిఎస్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించినట్లయితే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం అభివృద్ధి చెందుతారని అన్నారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన పౌష్టిక విలువలు కలిగిన రకరకాల ఆహార పదార్థాలను సహచర విద్యార్థులు , తల్లిదండ్రులు , గ్రామ పెద్దలు , కొనుగోలు చేసి విద్యార్థులను , ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సాయి రెడ్డి , ఉపాధ్యాయులు రవికుమార్ , లక్ష్మి , గిరిజ , నవనీత , విజయ లక్ష్మి , జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వాగ్దేవి అన్నారు. శనివారం మండలంలోని కుర్తి గ్రామంలో సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బాన్సువాడ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరంలో 20 మందికి బిపి, 30 మంది పేషంట్‌లకు షుగర్ పరీక్షలు, 25 మందికి దగ్గు, జలుబు , 5 గురికి జ్వరము , 10 రోగులకు కడుపునొప్పి , మోకాళ్ళ నొప్పులు , దమ్ము , ఇతర వ్యాధులకు సంబంధించిన 60 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితముగా మందులు పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహేందర్ రెడ్డి , మైపాల్ రెడ్డి , సురేందర్ రెడ్డి , హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజ్ లెక్చరర్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న జెట్టి విజయ్ కుమార్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లెక్చరర్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. అలాగే లింగంపేట్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శివకుమార్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని వివిధ కళాశాలలో లెక్చరర్స్ వీరిని అభినందించారు.

ఘనంగా ఆహార దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలనుసారం రాష్ట్ర వ్యాప్తంగా ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఆహార దినోత్సవ వేడుకలు 'ఫుడ్ ఫెస్టివల్' నిర్వహించినట్లు మండల విద్యాధికారి జక్కుల రవి కుమార్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ వంటకాలు సర్వపిండి, నువ్వుల ఉండలు, సకినాలు, మురుకులు దాదాపు 50 రకాల వంటకాలను చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటో అండ్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ రెండో మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆటో వర్కర్స్

నవతెలంగాణ-రెంజల్

నేటి నుంచి హైదరాబాదులో జరిగే ఆటో అండ్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ రెండో మహాసభను అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టియుసిఐ బోధన్ డివిజన్ నాయకులు, రెంజల్ మండలం నాయకులు వసి యుద్దీన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో యూనియన్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రసూల్ ఖాన్, హైమద్ ఖాన్, మైబుబ్, సద్దాం, అబ్బన్న, అశోక్, సాయికుమార్, మతిన్, సమీర్, సర్పరాజ్, వాహబ్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రం నుంచి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. ప్రభుత్వం అనుమతి లేకుండా వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని రెవిన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా తరలిస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంధన పొదుపు ముగింపు వారోత్సవాలు



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

టీజీ రెడ్కో ఆధ్వర్యంలో ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గూపన్‌పల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మెమోంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తరగని ఇంధన వనరులను ఉపయోగించుకుంటే భవిష్యత్తు తరాలకు ఉపయోగపడతాయని పిలుపునిచ్చారు. సోలార్ సబ్సిడీ పథకమైన పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దీని ద్వారా కరెంట్ బిల్లు ఆదా కావడమే కాక పర్యావరణాన్ని, సహజవాయువులను కాపాడిన వాళ్లమవుతామని తద్వారా భావితరాలకు విద్యుత్‌ను అందివ్వచ్చని టీజీ రెడ్‌కో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ కో జూనియర్ మేనేజర్ అరుణ్, ఫీల్డ్ ఆఫీసర్ జగదీప్ రాము, స్కూల్ ప్రార్థనోపాధ్యాయులు, టీచర్స్, పేరెంట్స్ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు ఈ సమావేశంలో ఇంటర్ విద్య 90 రోజుల ప్రణాళికను ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ వివరించారు. విద్యార్థినుల మార్కుల జాబితా, విద్యార్థుల స్థితిగతులను తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా పర్యవేక్షణ చేయాలని విద్యార్థుల భవిష్యత్తు వారి అభ్యున్నతికి తాము, అధ్యాపకులు కృషి చేస్తున్నామని అన్నారు. విద్యార్థులందరూ కళాశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. వారి భవిష్యత్తు తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. సమావేశంలో అకాడమిక్ మానిటరింగ్ కమిటీ అధ్యాపకులు ఫయీముద్దీన్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన గ్రామ సంఘం కమిటీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం (పి) గ్రామంలో గల లైబ్రరీని శనివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ సంఘం కమిటీ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రంథాలయాన్ని జిల్లాలోనే అత్యుత్తమ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతానని కచ్చితంగా త్వరలో దీన్ని ఆధునీకరించే విధంగా చూస్తానని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కెటీఎస్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థి కె.స్నేహరెడ్డి ఈ నెల 20న ముప్కాల్‌లో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ నెల 22 నుంచి 25 వరకు హైదరాబాద్ హాకింపేటలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 20 బాలికల కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్టు శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థని కే.స్నేహరెడ్డిని పాఠశాల డైరెక్టర్లు కె.భాను చందర్, ఎ.లక్ష్మణ్, కృష్ణవేణి పాఠశాల జోనల్ మేనేజర్ సంపత్, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు కె.గణేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పాల్దా పాఠశాలలో తెలంగాణ ఆహార దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని పాల్దా ప్రైమరీ పాఠశాలలో తెలంగాణ ఆహార దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. బలవర్ధకమైన ఆహారం తింటే పిల్లల్లో మానసిక, శారీరక పెరుగుదల అభివృద్ధి జరుగుతుందనే విషయాలపైన చర్చించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో స్వయంగా ఇంట్లో చేయించిన ఆహార పదార్థాలను నువ్వుల పట్టి, రాగి లడ్డు, పల్లిపట్టి, సర్వ పిండి, మక్క గారెలు ఆకుకూరలు ఇవి వారికి అందుబాటులో ఉన్న పదార్థాలతో తయారు చేయడంలో పిల్లలు తల్లిదండ్రులకు ఏ విధంగా సహాయపడ్డారో తల్లిదండ్రుల నుంచి సమాచారం సేకరించి పిల్లలకు అవగాహన కల్పించారు.

బోధన్ కోర్టులకు ప్రభుత్వ న్యాయవాదుల నియామకం



ఎంపికైన న్యాయవాదులు

నవతెలంగాణ-బోధన్

బోధన్‌లోని అదనపు జిల్లా జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జిల కు ప్రభుత్వ శనివారం న్యాయవాదులను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి ఆర్.తిరుపతి విడివిడిగా ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులో బోధన్ ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా మహమ్మద్ గౌసుద్దీన్‌ను, బోధన్ సీనియర్ సివిల్ జడ్జ్, జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులకు సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా బొగ్గుల రవీందర్‌ను, బోధన్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బోనాల మాధవిలతను నియమించారు. ప్రభుత్వ న్యాయవాదిగా నియమి తులైన మహమ్మద్ గౌసోద్దీన్ స్థానికంగా సీనియర్ న్యాయవాదిగా ఉండటంతో పాటు గతంలో బోధన్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. పట్టణంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా ఉన్నారు. సహాయ న్యాయవాదిగా నియామకం అయిన బొగ్గుల రవీందర్ 1992 నుంచి న్యాయవాదిగా బోధన్ కోర్టులో సేవలు అందిస్తున్నారు. పట్టణ మున్నూరుకాపు సంఘం కోశాధికారిగా సేవలను అందించారు. బోధన్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించబడిన బోనాల మాధవిలత స్థానికంగా న్యాయవాదిగా విధులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ న్యాయవాదులుగా నియామకం అయ్యారు. మొహమ్మద్ గౌసోద్దీన్, బొగ్గుల రవీందర్, బోనాల మాధవి లత మాట్లాడుతూ.. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి ప్రభుత్వానికి తమవంతు సేవలను అందిస్తామని అన్నారు. తమ నియామకానికి కృషిచేసిన స్థానిక బోధన్ శాసన సభ్యులు మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పలు ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం



ఏర్గట్ల: యోగా చేస్తున్న విద్యార్థినిలు



కమ్మర్‌పల్లి: యోగా చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల/కమ్మర్‌పల్లి

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజు 15 నిమిషాలు ధ్యానం చేయడం వల్ల శరీరానికి, మనస్సుకు అనేక లాభాలు కలుగుతాయని అన్నారు. భారత దేశం ఒక ధ్యాన కేంద్రంగా ఉండి ప్రపంచ దేశాలను ఆకర్షిస్తుందని, స్వామి వివేకానంద మొదలుకొని ఎందరో మహనీయులు ధ్యానాన్ని ఆచరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరొద్దీన్, ప్రసాద్, పవన్, రాజశేఖర్, ప్రవీణ్ శర్మ గంగాధర్, విజయ్, శ్రీనివాస్, నరేష్, సబిత పాల్గొన్నారు.

చౌట్‌పల్లిలో అంతర్జాతీయ మెడిటేషన్ దినోత్సవం..

కమ్మర్‌పల్లి : అంతర్జాతీయ మెడిటేషన్ దినోత్సవం సందర్భంగా మండలంలోని చౌట్‌పల్లిలోని కోటిలింగేశ్వర ఆలయంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సిబ్బంది ఆధ్వర్యంలో ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గంగాప్రసాద్ మెడిటేషన్ వల్ల ఏకాగ్రత లభిస్తుందని, విద్యార్థులకు చిన్న వయసు నుంచి మెడిటేషన్ అలవర్చడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు కనీసం అరగంట అయినా ధ్యానం చేయాలని, మానసిక ప్రశాంతత కూడా చేకూరుతుందన్నారు. ధ్యానం ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఐకెపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మతసామరస్యం అలవర్చుకోవాలి

- పలువురు వక్తల వెల్లడి
- స్నేహ సొసైటీలో ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు



స్నేహ సొసైటీలో సపోజ్ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సేవ తాత్పర్యం, మతసామరస్యం అనేది అలవర్చుకోవడం ఏసుప్రభు జన్మవృత్తాంతమని జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి, సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ సిహెచ్ జార్జ్ పేర్కొన్నారు. అన్ని గ్రంథాల్లో కూడా ఉండేది ఒకటే సారాంశం సేవ తాత్పర్యం, మరొకరికి సహాయం చేయడం మాత్రమేనని వారు తెలిపారు. దివ్యంగా విద్యార్థులు ఏసుప్రభు జన్మదినం గురించి కళ్లకు కట్టినట్టుగా చూపెట్టడం ఎంతో సంతోషంగా ఉందని వారు చెప్పారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో సపోస్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి, సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ సిహెచ్ జార్జ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు పుట్టుక గురించి దివ్యాంగ విద్యార్థులు కళ్లకు కట్టినట్టు గొర్రెలు, గాడిదలు, శాంటాక్లజ్ రూపాలలో ప్రదర్శించి అబ్బుర పరిచారు. అనంతరం విద్యార్థుల మధ్య సపోజ్ క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. కుల మతాలకతీతంగా మతసామరస్యాన్ని పెంపొందించే దిశగా భగవద్గీత, బైబిల్, ఖురాన్, గాని ఏ గ్రంథంలోనైనా ఉన్నది ఒకటే ఒక సారాంశం పరోపకారికి సహాయం చేయడం సేవా తాత్పర్యం అలవర్చుకోవడం అనేది ముఖ్య ఉద్దేశమన్నారు. క్రిస్టమస్ అంటే క్రీస్తు ఆరాధన అని తెలిపారు. ప్రజల కోసం తన ప్రాణాన్ని సైతం తృణప్రాయంగా త్యాగం చేశారని తెలియజేశారు. స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సిద్దయ్య జ్యోతి దివ్యాంగులను ప్రతి ఒక్కరిని చేరువ చేసుకొని వారి అభ్యున్నతికి కృషి చేయడం వారి పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. ప్రతి ఒక్కరు కుల మతాలకతీతంగా సేవాభావాన్ని అలవర్చుకొని మరొకరికి సహాయం చేయాలని సూచించారు. ఇటీవల కాలంలో వస్తున్న సోషల్ మీడియాలో కులాలు మతాల మార్పిడికి పాల్పడుతున్నారనేది తప్పు అని గుర్తు చేశారు. ఎవరికివారు వారి సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ ఉంటారని ఒకరు చెబితే వినే పరిస్థితిలో ఏ కులస్తులు మతస్తులు ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్.సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, యూట్యూబర్ వెంకటేశ్వర్ రావు, శ్రీధర్, బ్రహ్మయ్య దివ్యాంగుల పాఠశాలల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేతికి అందేటంత ఎత్తులో వైర్లు



చేతికి తగిలేలా ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మాదాపూర్ వెళ్ళే 11కెవి విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని స్థానిక రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గత 15 రోజుల నుంచి స్థానిక రైతు దేవానంద్ విద్యుత్ తీగలు సరిచేయడానికి కావాల్సిన వస్తువులను తీసుకువచ్చినా.. అధికారుల చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు తెలుపుతున్నారు. రైతులకు నాటు వేసే సమయంలో, వారి కోత సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పక్కగా చేపట్టాలి



డిచ్‌పల్లి: ధర్మారం(బీ)లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే

నవతెలంగాణ-విలేకరుల బృందం

రెంజల్ : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పక్కగా నమోదు చేయాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, గ్రామ కార్యదర్శి రాజుకు సూచించారు. మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. నిరుపేదలైన కుటుంబాలను గుర్తించి వారికి ఖాళీ స్థలం ఉంటే వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడ్డ కుటుంబాలను ఎంపిక చేసి పక్కాగా సర్వే జరిపించాలని ఆయన అన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ హెచ్.శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రాజు, స్థానిక నాయకులు వినోద్, జావీద్, బుడ్డు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం బీ లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే..

డిచ్‌పల్లి : మండలంలోని ధర్మారం బీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులున్నారు.

మోపాల్ : మండలంలోని తనకుర్తి, వివిధ గ్రామాలలో మొబైల్ యాప్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల వివరాలు నమోదు చేస్తున్న తీరును మండల పంచాయతీ అధికారి కిరణ్ పరిశీలించారు. సర్వే చేస్తున్న ప్రదేశానికి వెళ్లి లబ్దిదారుల అనుమానాలను నివృత్తి చేశారు. యాప్‌లో ఎటువంటి తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలోని సర్వే సిబ్బందికి రోజుకు ఎన్ని కుటుంబాలు వివరాలను నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల ప్రతి ఒక్కరింటికి వెళ్లి సర్వే చేయాలని తెలిపారు. సర్వే విషయంలో ఎటువంటి తప్పులకు తావులేకుండా చూడాలని వివరించారు. సర్వే విషయంలో ఎటువంటి సందేహాలు వచ్చినా కూడా తమను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఆయనతోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, కారోబార్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జీజీహెచ్‌లో జరుగుతున్న తప్పిదాలపై విచారణ చేపట్టి, బడుగు బలహీన వర్గాల, పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ జిల్లా కార్యదర్శి బత్తుల కిష్టయ్య అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)కు సంబంధించిన మాతశిశుసంరక్షణ కేంద్రం, క్రిటికల్ కేర్ భవన ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ఎమ్ఎల్‌సి (మెడికల్ లీగల్ సర్టిఫికెట్) రెండు బుక్కులను ప్రింట్ చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోందని, అంతేకాకుండా జీజీహెచ్ ఆరోగ్యశ్రీలో నష్టం వాటిల్లిందనే అంశాలపైన పలు పత్రికలలో కథనాలు వచ్చాయని వివరించారు. అదేవిధంగా జులై నెలలో డైట్ టెండర్ల కోసం టెండర్లు వేసినా.. వాటిని కూడా ఇప్పటివరకు టెండర్ల దారులను ఫైనల్ చేయకుండా హెూల్డ్‌లో పెట్టడం ఎందుకని, ఇటువంటి ప్రశ్నలకు అసంపూర్తి సమాధానాలు ఉండడంతో వీటిపైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చర్యలు తీసుకొని, ఈ సమస్యలపైన జరిగిన తప్పిదాలను తేల్చేందుకు, ఓ ప్రత్యేకమైన కమిటీని కలెక్టర్ ఆధ్వర్యంలో వేసి, జరిగిన తప్పులకు గల కారణాలు ఏమిటో పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మదాలే అజయ్, పట్టణాధ్యక్షులు విజయ్ సలాంకే, దయానంద్ సోన్‌కాంబ్లే, జగన్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీమ్ ఆర్మీ జిల్లా కార్యదర్శి బత్తుల కిష్టయ్య

వ్యతిరేకతను మరల్చేందుకే కేటీఆర్‌పై కేసు

- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం

నవతెలంగాణ-ఏర్గట్ల

కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను మరల్చేందుకే కేటీఆర్‌పై కేసు పెట్టారని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయలేదని, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను మరలించడానికి, స్థానిక ఎన్నికల్లో లబ్ది పొందడానికే కేటీఆర్‌పై అక్రమ కేసును నమోదు చేయించారని అన్నారు. ఫార్ములా వన్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టండి, చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ అంటున్నా, ప్రభుత్వం చర్చకు రాకుండా అతనిపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పరిపాలనను పూర్తిగా గాలికొదిలేసి కేసీఆర్‌పైన, కేటీఆర్‌పైన బురదజల్లడం మానుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ తరఫున హెచ్చరిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సిగసారం గంగారాం, దేవుడు నర్సయ్య, క్యాతం దేవేందర్, కట్కం సాగర్, జైనోద్దీన్, అష్రఫ్, అట్ల పోచయ్య, గన్నారపు రాజేశ్వర్, రొక్కెడ మోహన్, సురేష్, ఈశ్వర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం

ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఆహార దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా ఆహార దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించారని, ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంఈఓ బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఆహార దినోత్సవ వేడుకను పురస్కరించుకొని విద్యార్థులు స్వయంగా, తల్లిదండ్రులతో తెలంగాణ వంటకాలైన సర్వపిండి, నువ్వు ఉండలు, సకినాలు, సుమారు 80 రకాల వంటకాలను తయారు చేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ విద్యార్థులకు పౌష్టికాహారం గురించి ఎలా అందజేయాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న సావిత్రి బాయి పూలే పురస్కారాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీటీయు ఆధ్వర్యంలో జనవరి 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే సావిత్రి బాయి పూలే పురస్కారాల కరపత్రాలను జక్రాన్‌పల్లి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీటీయు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సావిత్రి బాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయిని, ఉద్యోగిని పురస్కారాలు 100 మందికి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచరి రవికుమార్, బీసీటీయు మండల అధ్యక్షులు మాణిక్యంగౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు యు.విజయ్‌కుమార్, మహేందర్, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు మేడిదాల ప్రవీణ్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి నామాల శంకర్, రఘు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గణితానికి గౌరవం.. విజ్ఞానానికి మార్గదర్శనం

సూత్రాలు అర్థం చేసుకుంటే లెక్కలు తేలికే.. నేడు జాతీయ గణిత దినోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్

ఈ విశాల విశ్వం అంతటా అన్నీ గణితీయంగానే సంభవిస్తాయి అని లైబినిడ్జ్ అనే గణిత శాస్త్రజ్ఞుడు అంటాడు. మానవుడు పసిబిడ్డగా ఈ భూమిపైకి వచ్చిన నాటినుంచి మరణం వరకు ప్రతి క్షణంలో, ప్రతి సందర్భంలో గణితాన్ని ఉపయోగిస్తాడు. అందువలన గణితం మానవ జీవితంతో అవినాభావ సంబంధం కలిగి ఉంది. ఆటాడుకునే పిల్లవాని నుండి అంతరిక్ష యాత్రికుని వరకు గణితాన్ని ఉపయోగించకుండా ఉండలేరు. అసలు గణితం ఉపయోగించకుండా ఒక్క క్షణం కూడా ముందుకు సాగలేమంటే అతిశయోక్తి కాదేమో. గణితం అంతగా మానవ జీవితంతో పెనవేసుకుంది. అలాగే మానవ నాగరికతతో పాటు గణితం కూడా అభివృద్ధి చెందుతూ ఉంది. అందువలనే మానవ మనుగడకు గణితం అర్థం లాంటిదని పేర్కొన్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగినందు వలన గణితం ఆవశ్యకతను నేటి తరం నుండి ముందు తరాల వారికి వ్యాప్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి. ఆ కారణంగానే మన మన భారత ప్రభుత్వం డిసెంబర్ 22ను జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించింది. గణితశాస్త్రం అనగానే భారతదేశంలో గుర్తుకు వచ్చే పేరు శ్రీనివాస రామానుజన్. అతని జన్మదినమైన డిసెంబర్ 22ను అతను గణితానికి చేసిన సేవలకు గుర్తుగా మనం జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

గణిత దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యాలు..

నేటి తరం విద్యార్థులలో గణితశాస్త్రం పట్ల ఆసక్తిని, శ్రద్ధను పెంపొందించాలి, గణితానికి ఉన్న ప్రాముఖ్యతను వివరించాలి, విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రేరణ కల్పించాలి, గణిత శాస్త్రం ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే రామానుజన్ జీవిత చరిత్ర, ఆయన చేసిన అపూర్వ గణిత కృషిని గుర్తుచేసుకోవడం ఈ గణితశాస్త్ర దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.

గణిత శాస్త్రానికి వారు చేసిన సేవలు..

శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబర్ 22న తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడులో జన్మించాడు. ఇతనికి చిన్నప్పటి నుండి గణితంలో ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. తన 11వ ఏటా రామానుజన్ గణిత శాస్త్రం పట్ల అద్భుతమైన దృష్టిని కనబరిచాడు. సంఖ్యలపై రామానుజన్‌కు సంపూర్ణ అవగాహన ఉంది. ఇతను ప్రధాన సంఖ్యలు, వింతచదరాలు, వితత భిన్నాలు, వర్గమూలాలగూడు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రాల్స్ పై పరిశోధన చేశాడు. ఆయన పేరుపై గల రామానుజన్ సంఖ్య 1729 ఇందుకు ఒక ఉదాహరణ. ఫెలో ఆఫ్ ది రాయల్స్ సొసైటీ, ఫెలో ఆఫ్ ట్రినిటీ కాలేజీ గౌరవం పొందిన మొదటి భారతీయుడు రామానుజన్. గణితంపై ఇతనికి ఉన్న పరిశోధనా శక్తి మాత్రం అమోఘం. అలాగే ఇండియన్ మేథమెటికల్ సొసైటీ అనే పత్రికలో ఇతని వ్యాసాలు అనేకం ప్రచురితమయ్యాయి. ఇక రామానుజన్ చివరి దశలో మాక్ తీట ఫంక్షన్స్ పై చేసిన పరిశోధన ప్రసిద్ధమైంది. శ్రీనివాస రామానుజన్ చివరగా 1920 ఏప్రిల్ 26న మరణించాడు. అతని జీవిత కాలం 32 సంవత్సరాల 4 నెలల 4 రోజులు మాత్రమే. రామానుజన్ గణిత శాస్త్రజ్ఞుడు అనేది ప్రదానం కాదు. ఆయన మానవ మేధస్సు ఎంత చేయగలదో నిరూపించాడు. ఓమహనది లాంటిది రామానుజన్ జీవితం. నది ఎలాగైతే ప్రవహించినంత మేర పరిసరాలను సస్యశ్యామలం చేస్తుందో అలాగే రామానుజన్ చేసిన ప్రతి అడుగు గణిత శాస్త్రాన్ని ప్రకాశవంతం చేసింది.

విద్యార్థులు పొందాల్సిన స్ఫూర్తి..

శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో ఒక గొప్ప మేధావి. ఆయన జీవితం నేటి విద్యార్థులకు అనేక స్ఫూర్తిదాయకమైన పాఠాలను అందిస్తుంది. శ్రీనివాస రామానుజన్‌లా ప్రస్తుత విద్యార్థి లోకం గణితంపై గాఢమైన ఆసక్తి, అభిరుచిని చిన్న నాటినుంచి పెంపొందించుకోవాలి. స్వీయ అధ్యాయనాన్ని అలవరుచుకోవాలి. ఆత్మవిశ్వాసంతో ఎదురైనా కష్టాలను అధిగమించడంలో నిబద్ధతను ప్రదర్శించాలి. శ్రీనివాస రామానుజన్ సాధారణమైన గణితానికి భిన్నమైన పద్ధతులు ఆవిష్కరించాడు. అలాగే నేటి విద్యార్థులు కూడా సృజనాత్మకత, నూతన ఆలోచన పట్ల ఎలా ఓపికతో ఉండటం, తమ మీద తమకు నమ్మకం కల్గి ఉండటం అనేది అలవరుచుకోవాలి.

గణిత శాస్త్రానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యత..

కృత్రిమ మేధస్సు, యంత్ర అధ్యయనం ఈ శతాబ్దంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలు. వీటి మూలసూత్రాలు గణిత శాస్త్రంలో దాగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు గణిత శాస్త్రానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (ఏఐ), యంత్ర అధ్యయన (ఎంఎల్) యుగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండాలంటే గణిత విషయాలు అయిన ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్‌లో పటిమ, రేఖాగణితం, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్‌పై అవగాహన, డేటా మోడలింగ్, విశ్లేషణ సామర్థ్యం అవసరం. కృతిమ మేధస్సు, యంత్ర అధ్యయనం విద్యార్థుల భవిష్యత్తును అద్వితీయంగా చేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి భవిష్యత్తును అందిపుచ్చుకోవటంలో విద్యార్థులు ముందుండాలంటే గణితంపై మక్కువను చిన్న నాటి నుండి పెంపొందించుకోవాలి.

రామానుజన్ సేవలు చిరస్మరణీయం



గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన స్ఫూర్తితో ప్రతి విద్యార్థి గణిత శాస్త్రం పట్ల భయాన్ని వీడి ఆసక్తిని పెంపొందించుకుని భవిష్యత్తులో వచ్చే సవాళ్లను అధిగమించి జీవితాన్ని సుస్థిరం చేసుకోవాలి.

- మహేశ్వరం భాగ్య లక్ష్మీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మాథెమాటిక్స్.

ముందుగా భయాన్ని పోగొట్టాలి



విద్యార్థుల్లో గణితం అంటే ఉన్న భయాన్ని తొలగిస్తే వారు సగానికి పైగా నేర్చుకునే ఆస్కారం ఉంటుంది. వారిలో ఉత్తేజం కలిగేలా స్నేహపూర్వక వాతావరణంలో బోధించాలి. ముఖ్యంగా సందేహాలను అర్థమయ్యే పద్ధతిలోనే చెప్పాలి. అప్పుడే విద్యార్థులకు గణితం అంటే భయం పోతుంది. **- లక్కారం సాగర్, నలంద హైస్కూల్ ప్రిన్సిపాల్, మామిడిపల్లి.**

సూత్రాలను అర్థం చేసుకోవాలి



గణిత శాస్త్రంలోని సూత్రాలను అర్థం చేసుకుంటే ఎంత పెద్ద సమస్య అయినా దాన్ని సులభంగా పరిష్కరించడానికి వీలుంటుంది. 10వ తరగతి విద్యార్థులు గణితశాస్త్రంలో వందకు వంద మార్కులు కూడా సాధించ వచ్చు. మ్యాథ్స్‌ను అర్థం చేసు కుంటే ఎంతో సులభంగా సమస్యను పరిష్కరించవచ్చు.

- రాజుల దేవి రామకృష్ణ, లిల్లీపుట్ పాఠశాల కరస్పాండెంట్, ఆర్మూర్.

అమిత్‌షా వ్యాఖ్యలపై మండిపాటు

- దళిత సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



బోధన్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తూ నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : కేంద్ర మంత్రి అమిత్ షా గత నాలుగు రోజుల క్రితం పార్లమెంటు సమావేశాలలో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవహేళనతో మాట్లాడడంతో ఆయన తీరును నిరసిస్తూ శనివారం సాలూర మండలం అంతరాష్ట్ర రహదారిపై సాలురా, ఖాజాపూర్, హూన్సా, కల్దుర్కి, తగ్గెల్లి గ్రామాలకు చెందిన మాల మహానాడు నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు, మాల మహానాడు సాలూర మండల అధ్యక్షులు రాహుల్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని నిర్మించి దేశానికి ప్రజాస్వామ్య పాలన అందించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం, అవహేళనగా మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. తక్షణమే మోడీ ప్రభుత్వం ఆయనను క్యాబినెట్ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన సందర్భంగా అంతరాష్ట్ర రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దాంతో సమాచారం అందుకున్న బోధన్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులను నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు తగ్గెల్లి దేవేందర్, సరిడే యాదు, విఠల్, గంగాధర్, హనుమంతు, సాయిలు, ఖాజాపూర్ సంభాజీ, ఖాజాపూర్ లక్ష్మణ్, కల్దుర్కి బాబు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా చేసిన వ్యాఖ్యాలను వెనక్కి తెలుసుకోవాలి..

నిజామాబాద్ సిటీ : అమిత్ షా చేసిన వ్యాఖ్యాలను వెనక్కి తెలుసుకోవాలని ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి ఎం.శివకుమార్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ద్వారకనగర్ నగర కమిటీ ఆఫీసులో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నగర నాయకులు రాజు, మోహన్, ప్రసాద్, ఇర్ఫాన్ సురేష్, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్ షా బీఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన మాటలను వెనక్కి తీసుకోవాలంటూ మండలంలోని రెంజర్ల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కవి, రచయిత రెంజర్ల రాజేష్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి హోదాలో ఉంటూ దేశ రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పైన మాట్లాడిన మాటలు సరైంది కాదన్నారు. అంబేద్కర్ జిందాబాద్, రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అంబేద్కర్‌పై మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. లేనియెడల దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన అధ్యక్షులు చిటుమల రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యాన్ని అనుమతించాలి

- తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులలో అనుమతించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ తెలిపింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో చర్చించి, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం పరిధిలోని వెల్నెస్ సెంటర్‌ను పటిష్ట పరచాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి శనివారం సుభాష్‌నగర్‌లో గల ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు కే.రామ్మోహన్ రావు, జిల్లా నాయకులు శిర్ప హనుమాన్లు, ఇ.వీ.ఎల్. నారాయణ, హమీద్ ఉద్దీన్, లక్ష్మీనారాయణ, లింగయ్య, శ్రీనివాస్ రావు, రైసుద్దీన్, జీవన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంజూరు చేయించిన ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్‌గౌడ్, దేవేందర్, శేఖర్, సంజీవ్, సాగర్, సంతోష్, రమణ, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్టకు ప్రత్యేక టీం ఏర్పాటు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు గానూ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకమైన టీం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ జె.మల్లయ్య శనివారం తెలిపారు. ఈ టీం ప్రతిరోజు రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు మంజీరా పరివాహక ప్రాంతంలోని గ్రామాలు కొడిచెర్ల, పోతంగల్, హంగర్గా, కారేగాం, సుంకిని గ్రామాలలో మంజీరా వాగు వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా రాత్రి మొత్తం పహారా చేస్తున్నామన్నారు.

గణితం జీవితంలో భాగమే



బాల్కొండ:మోడల్ స్కూల్‌లో రామనుజన్ చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : గణితం అనేది ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో ఒక భాగమని బోధన్ మండల ఎంఈఓ నాగయ్య అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గణిత మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో నిష్ణాతులుగా ఎదగడానికి ఈ గణితమేళా ఎంతో ఉపయోగపడుతుందని, కావున విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా, అర్థమయ్యే రీతిలో గణితం బోధించాలని సూచించారు. అనంతరం ఆయన గణిత మేళాలో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అరిఫోద్దీన్, జేసి హైస్కూల్ హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు హన్నాగ్రేస్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో..

ఆర్మూర్ : పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ వివిధ రకాల గణిత పరికరాలతో సమస్యలను ఎలా పరిష్కరించాలో తెలియజేశారు. గణితానికి సంబంధించిన వివిధ రకాల చార్టులతో చక్కగా వివరించారు. సులువైన పద్ధతిలో గణితం ఎలా నేర్చుకోవాలనే విషయాన్ని విద్యార్థులు యాక్టివిటీతో చక్కగా ప్రదర్శించారు. అంతేకాకుండా వివిధ రకాల గణిత పిరమిడ్‌తో చక్కని ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. మన నిజ జీవితంలో గణితం ఎంతగానో ఉపయోగపడుతుందని, అందుకనే ప్రతి ఒక్కరూ గణితంపై మక్కువ చూపించి గణితాన్ని ఇష్టంగా నేర్చుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



బాల్కొండ : తయారు చేసిన పరికరాలతో శాంభవి విద్యార్థులు

నలంద పాఠశాలలో..

పట్టణం పరిధిలో మామిడిపల్లి నందు నలంద హై స్కూల్ లో భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ సాగర్, కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడారు. చక్కటి మాథ్స్ ప్రాజెక్ట్ ప్రదర్శనలకు కారణమైన మాథ్స్ ఉపాధ్యాయులు సతీష్, శివాదత్తు, శ్వేత, నిఖిత, రాజశ్రీ ఉపాధ్యాయులను విద్యార్థుల సమక్షంలో శాలువా మెమెంటోస్‌తో సత్కరించారు.

పోతంగల్ : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ శంకర్ ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి మొత్తం 92 మంది విద్యార్థులు గణిత నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంధపు పవన్ కుమార్, శంకర్ స్వామి, గంగాధర్, తల్లిదండ్రులు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో..

బాల్కొండ : గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో రామానూజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన మ్యాథ్స్ మోడల్స్, వివిధ నమునాలు, మైకోఆర్టిస్ట్ బియ్యపు గింజలపై, నవ్వుల గింజలపై రాసిన మ్యాథ్స్ ఫార్ములాలు, టేబుల్స్, చూడ ముచ్చటగా కనువిందు చేశాయి. విద్యార్థులచే ప్రదర్శించిన నాటకాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివర్లో విద్యార్థులు పాల్గొన్న క్విజ్ ప్రోగ్రామ్ విద్యార్థులను ఉత్తేజపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులచే తయారు చేయబడిన మ్యాథ్స్ మోడల్స్‌లతో వారిలో జ్ఞానాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించి వారికి గణితంపై ఆసక్తి కల్పించిన ఉపాధ్యాయులకు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీమరాజు, శ్రీకాంత్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

శాంభవిస్కూల్‌లో..

రామనుజన్ జయంతి సందర్భంగా శాంభవి హై స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మాథ్స్ కు సంభందించిన ఎక్స్పిరిమెంట్స్ తయారు చేసి ప్రదర్శన చేశారు. పాఠశాలలో ఉన్న మాథ్స్ ల్యాబ్ పరికరాలు, వాటి ఉపయోగాలు ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ బొట్ల రవీన్ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర, మదర్ థెరిస్సా హైస్కూల్స్‌లో..

భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర హై స్కూల్, మదర్ థెరిస్సా హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. గణితంపై శ్రీనివాస రామానుజన్ చేసినటువంటి కృషిని విద్యార్థులకు వివరిస్తూ, ఈ గణిత దినోత్సవం నిర్వహించుకోవడం వలన విద్యార్థులను గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవడానికి, దాని అందాన్ని అన్వేషించడానికి, గణితం, సంబంధిత రంగాలలో వృత్తిని కొనసాగించడానికి ప్రోత్సహిస్తుందని మదర్ థెరిస్సా హైస్కూల్ కరస్పాండెంట్ రామలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు గణిత చిహ్నాలైన కూడిక, తీసివేత, భాగహార, త్రి భుజాల, వలయం ట్రై యాంగిల్ గుర్తులుగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర హైస్కూల్ హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి, మదర్ థెరిస్సా హై స్కూల్ హెడ్ మాస్టర్ కే నరసింహారెడ్డి, కరస్పాండెంట్ రామలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : లిల్లీపుట్ పాఠశాలలో..



ఆర్మూర్ : నలంద పాఠశాలలో..

గణితం లేనిదే ప్రపంచం లేదు



పెద్దకొడప్‌గల్‌లో స్పీచ్ ఇస్తున్న విద్యార్థిని

- జాతీయ గణిత దినోత్సవంలో పలువురు వక్తలు
- స్కూళ్లల్లో వేడుకలు..
- ప్రాజెక్టులతో అలరించిన విద్యార్థులు



మద్నూర్‌లో మాట్లాడుతున్న పలువురు



నాగిరెడ్డిపేట్‌లోని గోపాల్‌పేట్ జడ్పీహెచ్ఎస్‌లో..

నవతెలంగాణ-విలేకరులబృందం

గణితం లేనిదే ప్రపంచం లేదని, దైనందిన సమస్యల పరిష్కారానికి గణితం చాలా ఉపయోగపడుతుందని, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎక్కడైనా ఏ పరిశోధనలకైనా గణితమేప్రాతినిధ్యం వహిస్తుందని పలువురు పేర్కొన్నారు. జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు స్కూళ్లల్లో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫజిల్స్, గేమ్స్, ఇతరాత్ర ప్రయోగాలు అలరించాయి. ఈ సందర్భంగా గణిత పితామహుడు శ్రీనివాసరామానుజన్‌కు నివాళి అర్పించారు.

మద్నూర్ : శ్రీనివాసరామానుజన్ అందరికి ఆదర్శప్రాయుడని, గణిత శాస్త్రం లేకుండా ఈనాడు ప్రపంచం ఏ రంగాలలోనూ ముందంజ వేయలేదని ప్రిన్సిపాల్ నందాల గంగా కిషోర్ పేర్కొన్నారు. మద్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమాన్ని ఒకరోజు ముందుగా నిర్వహించారు. గణిత జ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థుల చేత వినూత్నమైన ప్రయోగాలను చేయించారు. ప్రముఖ వ్యాఖ్యాత, పద్యకవి, సంస్కృతోపన్యాసకులు బి వెంకట్ మాట్లాడుతూ- గణితమేరా జీవితం, గణితమేరా శాశ్వతమని, ఆధునిక ప్రపంచంలో గణిత నైపుణ్యం ఇంజనీరింగ్ లో ఉన్నాయని అన్నారు. సహాయ ప్రధానోపాధ్యాయులు, గణితోపాధ్యాయులు- సుమన్,హనుమాండ్లు, గంగా ప్రసాద్, సంజయ్ లు మాట్లాడుతూ-ప్రపంచంలో గణితం సామాజికరంగాలలో,భాగంగా ఉందని అన్నారు. గణితం ప్రతిరూపం ప్రతిరోజు మన జీవితాలను ప్రభావితం చేస్తుందని, అన్నారు. గణితం లేకపోతే ప్రపంచం పురోగతి సాధించలేదని వారన్నారు.

అలరించిన గణిత ప్రయోగాలు

విద్యార్థులు-గణేష్, శ్రీకాంత్, సిద్ధాంతి, పవన్, విష్ణు, సాయి చరణ్, జ్ఞానేశ్వర్,నితిన్, సంకీర్తన్,శివానంద, ఆదిత్య లు స్వయంగా తయారుచేసిన గణిత ప్రయోగాలలో రాణించారు. మ్యాజిక్ గణితం,గణిత పరియోజనం, గణితపజిల్ ,క్యాలెండర్ ట్రిక్స్, జ్ఞాపకశక్తి సంఖ్యలు, మ్యాజిక్ బోర్డ్స్, శ్రీనివాస రామానుజన్ బయోగ్రఫీ వంటి ప్రదర్శనలు ఆకర్షించాయి. ఉపాధ్యాయులు జె.గణేష్, సంతోష్, వేణుగోపాల్, నరహరి, రాము, సమీనా,కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థులు, తదితరులు. పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ మాథమిటీక్స్ డే

సదాశివనగర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల యందు నేషనల్ మాథమాటిక్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి జ్యోతిప్రజ్వలన చేసి, భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో భాగంగా అధ్యాపకులకు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలైన మెమోరి గేమ్, సుడోకు, మాథ్స్ మేజ్, క్విజ్, పోస్టర్ ప్రెసెంటేషన్, షార్ట్ ట్రిక్స్ ఇన్ మాథ్స్‌లను నిర్వహించి, గెలుపొందిన అధ్యాపకులకు, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఉదయిని, గణిత విభాగాధిపతి శ్రీలత, ఫాకల్టీ జి.వనజ, స్టాటిస్టిక్స్ ఫాకల్టీ సుజాత, అఖిల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో..

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితం పై పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సబాత్ కృష్ణతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం రోజున శ్రీనివాస రామానుజన్ జయంతినిఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కమల మాట్లాడుతూ గణితం నాగరికతకు అద్దంలాంటిదన్నారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన గొప్ప గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో ఎన్నో ఫార్మలాలను కనుగొన్నారన్నారు. 1887లో జన్మించిన ఆయన గణితంలో 3900 సమస్యలకు సులభ తరమైన పరిష్కారాలను కొనుగొన్నారని తెలిపారు. 32 వయస్సులోనే ఆయన మరణించడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్ రెడ్డి, శ్రీనివాస్, కిషోర్, రవికుమార్, ఉమాదేవి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

హోవర్డ్‌లో గణిత దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ







తాము రూపొందించిన ఫజిల్స్ గురించి వివరిస్తున్న విద్యార్థులు

నగరంలోని రోటరీ నగర నందు గల హోవర్డ్ హైస్కూల్లో గణిత దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేకంగా రూపొందించిన మోడల్స్, గేమ్స్, ఫజిల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా హోవర్డ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రిన్సిపాల్ శశికళ మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని పోగొట్టి, సులువుగా అవగాహన పెంచుతుందని వివరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ టి.వి.ఆర్. మూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పోటిరంగంలో మ్యాథ్స్, ఫిజిక్స్‌లవి ప్రధానపాత్ర ఉందని, పిల్లలు వీటిల్లో ప్రావీణ్యం పొందితే ఏ పోటీ పరక్షల్లోనైనా తేలిగ్గా నెగ్గగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. మహోన్నత గణిత విద్యాంసుడైన శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహించడం జాతికే గర్వకారణ మన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తల్లిదండ్రులు ఆడిన ఆటల మధ్య వేడుక ఘనంగా సాగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్



మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన కటికే కపిల్ (28) ఈనెల 18వ తారీకు నుండి ఇంట్లో నుండి వెళ్లిపోయి ఇప్పటివరకు ఇంటికి రాలేదని నిజాంసాగర్ ఎస్సై శివ తెలిపారు. తన భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలో శనివారం స్మశాన వాటికలో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు అక్కడికి వెళ్ళగా నలుగురు పేకాట ఆడుతుండగా వారిని అదుపులోనికి తీసుకున్నట్టు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు. వారి నుండి రూ. 11540 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : కేంద్ర హోంమంత్రిని తన మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరడి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పూలంగ్ ప్రాంతంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్ షా దిష్టిబొమ్మను దహనంచేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సక్కి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు సక్కి ప్రభంజన్, ఎంపీజే స్టేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్, జిల్లా అధ్యక్షులు షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..

శవయాత్ర..

కమ్మర్‌పల్లి : వేల్పూర్ మండల కేంద్రంలో మాల సంఘం, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ స్వామి రావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాల సంఘం, అంబేద్కర్ యువజన సంఘం, మైనారిటీ సంఘం, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బాల్కొండలో నల్లబ్యాడ్జీలతో నిరసన



నగరంలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మాలమహానాడు

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన..

బాల్కొండ : కేంద్ర మంత్రి అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు ధర్మ సమాజ్ పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ అదేశాల మేరకు మండల కేంద్రంలో డిఎస్‌పి మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం, పూలమాలలు వేసి నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నిశాంత్ మాట్లాడుతూ.. అమిత్ షాను తక్షణమే కేంద్ర మంత్రి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మురళి, రంజీత్, ఆత్మ గౌరవ్, కౌశిక్, రుచిత్, ఆకాష్, ఆదర్శ్, పాల్గొన్నారు.